# గాయత్రి మొగుడు

"డార్లింగ్ రమేష్...రమేష్..."

"ఒస్తున్నా...ఒస్తున్నా గాయత్రి డియర్..."

"ఏంటి...ఇంకా వొస్తున్నానంటావ్... ఈ పాటికి ఒచ్చెయ్యాలి. ఎన్నిసార్లు పిలవమంటావ్..."

"క్షమించండి... పొయ్యిమీద పప్పు అడుగంటి పోతుంటేనూ దింపి ఒచ్చేను."

"తొందరగా కానీ... ఆఫీసుకి టైమయిపోతోంది. నీకేం, పది గంటలకెళతావు స్కూలుకి. నాలుగు ముక్కలు ఆ పిలలకిచెప్పి, చక్కగా నాలుగింటికల్లా ఇంటికొస్తావ్. నేనేమో ఎనిమిది గంటలకల్లా వెళ్ళిపోవాలి ఫ్యాక్టరీకి. లేకపోతే మా బాస్ ఎగిరి పడతాడు రావణాసురిడిలా."

"అయిపోయింది డియర్... ఒక్క నిమిషం. చారుకి పోపేసేస్తే అయిపోతుంది." గంట తిప్పుకుంటూ వెళ్ళిపోయాడు రమేష్.

"ఊఁ తొందరగా కానీయ్..."

"అలాగే—"

కుర్చీలో కూర్చుని, శాండిల్ తొడుక్కుంటోంది గాయత్రి.

"మమ్మీ... స్కూలుఫీజు కట్టాలి... ఇవాళే ఆఖరి రోజు..." నసిగింది సుగుణ.

"మమ్మీ నా గేమ్స్ యూనిఫారమ్ చిరిగిపోయింది." బెదురుతూ చెప్పాడు వెంకట్...

"చిరిగిపోతే డాడీని కుట్టమనక పోయావా? నాలుగింటికే ఇంటి కొస్తారుకదా ఏం చేస్తారూ అప్పటినుంచి ఇంటిలో? వెధక ఫ్యాక్టరీనుంచి నేను కొంపకు చేరుకునేసరికే రాత్రి ఎనిమిదవుతుంది, ఛీ...ఛీ..."

"డియర్...భోజనం రెడీ..." రమేష్ గాయత్రి పర్సు, హాండ్ బ్యాగు సిద్ధం చేస్తూ చెప్పాడు.

"వడ్డించు వస్తాను." అంటూ సుగుణ స్కూలఫీజుకి డబ్బులిచ్చి వచ్చి కంచంముందు కూర్చుంది గాయత్రి. రమేష్ వడ్డిస్తున్నాడు.

"డియర్...బియ్యం నిండుకున్నాయి. రేపటికి సరిపోవు" మెల్లగా నసిగాడు రమేష్,

"ఇదేమిటి రమేష్. ఈ నెల అప్పుడే అయిపోయాయేం? ఇవాళింకా 25వ తారీకేగా?" కోపంగా అరిచింది గాయత్రి.

"అదేమిటి డియర్... నేనేమైనా దుబారాగా ఖర్చుపెడుతున్నా

ననుకున్నావా? ఈ నెలలో మీబాస్‌నీ, మరికొందరు కొలీగ్స్‌నీ మూడు నాలుగు సార్లు భోజనానికి పిలవలా..."

"నాన్సెన్స్ అయినా... ఇంత ఖర్చేమిటి? ఈ నెల అప్పుడే రెండు సార్లు చక్కెర బ్లాకులో కొన్నాం. నీఖర్చు నాకర్థం కావడంలేదు, చూసి ఖర్చుపెట్టు" రుసరుస లాడుతూ హ్యాండ్ బ్యాగ్ తీసుకొని వెళ్ళిపోయింది గాయత్రి.

కంటనీరు పెట్టుకున్నాడు రమేష్. "ఏడవకు నాన్నా...అమ్మకెప్పుడూ కోపమేగా" అంటూ దగ్గిరకెళ్ళి కళ్ళనీళ్ళు తుడిచారు పిల్లలు.

"అవును బాబూ... ఏడవను. అమ్మకి ఎంత చేసినా కోపమే. ఊరి మీద కోపం, ఇంటికొచ్చి, మొగుడిమీద చూపిస్తుంది, చవగ్గా దొరికేడు కదా"! కళ్ళొత్తుకున్నాడు రమేష్.

"నాన్నా...చాక్లెట్టు కావాలీ... ఈ... ఈ..." మూడేళ్ళ బుజ్జిగాడు, మారాం మొదలెట్టాడు ఓయ్... ఓయ్... ఓయ్... ఏడవకు బాబూ... ఊరుకో... సాయంత్రం అమ్మగారు ఆఫీసునుంచొచ్చేటప్పుడు తెస్తుంది నాన్నా... ఊరుకో..." ఎత్తుకొని బుజ్జగిస్తున్నాడు రమేష్...

"నాన్నా... స్కూలుకి టైమైంది. టిఫిన్ కట్టు."

"వస్తున్నానమ్మా... ఒరేయ్ ... వెంకట్ ... దానికి టిఫిన్ కట్టియ్యరావద్రా .. కొంచెమైనా పనిరాదు. ఎలా మసలుతాడో ఏమిటో పెళ్ళాందగ్గర."

"నాకేం నాన్నా—మొగాణ్ణి. అక్కని నేర్చుకోమనిచెప్పు పని."

"ఒరేయ్— ఒరేయ్— అవన్నీ పాతమాటలురా. మహిళా సంవత్సరంలో మగాడు అలా మాట్లాడకూడదు. అందుకేగా మీ అమ్మ నాచేత వంట చేయిస్తోంది, నరేలే పద— నీకు స్కూలు టైమయి పోతోంది—" అంటూటిఫిన్ కట్టడానికి లోపలికెళ్ళిపోయాడు రమేష్.

✤ ❋ ✿ ✱

ఇదంతా పక్కవాటా లోంచిచూస్తూన్న పరంధామయ్యగారికి ఏమీ అర్థంకాలేదు.

"మీనాక్షి ! ఏమిటే ఈగోల? ఆవిడ, వంటా పెంటా అంతా ఈన మొహాన పడేసి పోతుందేం? ఛస్తున్నాడా మానవుడు." అన్నారు అయోమయంగా, పరంధామయ్యగారు.

"మునుపు బాగానే వుండేదండీ... ఇదిగో ఓ నెల్లాళ్లనుంచీ ఇలా మొదలెట్టింది. ఏమిటే అంటే— ఇదేదో మహిళా సంవత్సరమట కదూ... అందుకని మీటింగులయ్యాయట, స్వాతంత్ర్యం మొదలయిన విషయాలు మాట్లాడుతూ, పుండరీకాక్షమ్మగారు చెప్పారట, అందే మహిళా సంస్థ అధ్యక్షురాలు—."

"పుండరీ కాక్షమ్మంటే... ఆవిడేనా.... కామయ్య పెళ్ళాం—" మధ్యలో ప్రశ్న వేశారు పరంధామయ్యగారు.

"ఆఁ— ఆఁ— ఆవిడే—" తల ఊపింది మీనాక్షమ్మ.

"ఈవిడ బాధ పడలేక ఒకనాడు బట్టలుతకడానికని బావికెళ్లి దూకి చచ్చాడా కామయ్య—"

"అలాగా"— బుగ్గలు నొక్కుకుంది మీనాక్షమ్మ.

"ఆవిడందట మీటింగులో— ఆడాళ్ళే ఎందుకు వంటచేసి యిల్లు జూసుకోవాలి? మొగాడెందుకు చెయ్యకూడదు. ఆడవాళ్ళు ఉద్యోగాలు చెయ్యడంలా? అలాగే మొగాళ్ళు వంటచేస్తే తప్పేమిటి?" అని. అప్పటి నుంచీ గాయత్రి మారిపోయిందండీ— తను మగాడిలా ఆఫీసు, బజారు పన్లు చేస్తుంది. అతనువంటా, పిల్లలూ చూసుకుంటూన్నాడు" చేతులు తిప్పుకుంటూ చెప్పింది మీనాక్షమ్మ.

"ఇంకానయం అతనిచేత పిల్లల్ని కూడా కనిపించేలా వుందా అమ్మాయి, నవమాసాలు మోయించి హయ్యోరాత! మనవాళ్ళు 'స్త్రీ స్వాతంత్రం' అనే మాటని ఎంత దుర్వినియోగం చేస్తున్నారు."

"అదేమిటండీ—— పేపర్లల్లోనూ— మీటింగుల్లోనూ ఈ విషయాలు రోజూ చెబుతున్నారటగా! అంది ఆశ్చర్యంగాతను విన్నది తప్పాఅన్నట్టు.

"అసలు ఈ గొడవంతా విదేశాలనుంచి పుట్టుకొచ్చింది. కొన్ని దేశాలలో స్త్రీలకి ఓటువేసే హక్కులేదు. అంటే రాజకీయాలలో పాల్గొనే అర్హత లెదన్నమాట."

"కానీ, మనదేశంలో వుందిగా-అందుకే ఆడవాళ్ళుకూడా మంత్రులవుతున్నారుగా, మనకి ఆడ ప్రధానమంత్రిలేదూ—" తనకి బాగా అర్థమైనట్టు చెబుతోంది మీనాక్షమ్మ. "కరెక్టు. అయితే మనదేశంలో చదువుకున్న ఆడవాళ్ళ సంఖ్య మరీతక్కువ. స్వేచ్ఛగా అమ్మాయిల్ని చదువుకోనివ్వడం, తను చదువుకోవాలనుకుందో, ఎలా స్థిరపడాలనుకుందో, జీవితంలో నిర్ణయించుకొనే హక్కును పొందడం ఆడవాళ్ళకి కావాలి. అంతేకాదు విద్యావంతురాలైన స్త్రీ ఉద్యోగం చేస్తూవుంటే, ఉన్నత స్థానాన్ని పొందే అర్హత కలిగినప్పుడు, "ఆడది" అని నిర్లక్ష్యంచెయ్యకుండా ఆ స్థానాన్ని ఆమెకివ్వడం — ఇవి వాళ్ళు అడగదలచుకున్నవి పొందదలచు

కున్నవీను. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నప్పుడు, ఆమె ఇంటి పన్లతో సతమతయి పోతూవుంటే, మగాడు సాయంచెయ్యడం కనీస మానవత్వం. తనకి చాతనైతే చేస్తాడు చెయ్యలేనివాడైతే ఎవరిచేతైనా చేయిస్తాడు. అంతేకాని, గాయత్రిలా తయారైతే జీవితం తల్లక్రిందులవుతుంది." ఆవేశంతో చెప్పుకుపోతున్నారు పరంధామయ్యగారు.

ఆమాటలు వింటూనే మెల్లగా నడుంవాల్చింది మీనాక్షమ్మ. అంతలోనే ఏదో మెరుపులాంటి ఆలోచన వచ్చి చటుక్కున లేచి కూర్చుంది.

"ఏమండీ ఆడవాళ్లకి మరికొన్ని హక్కులు కూడా కావాలండీ" అంది ఏదో తీవ్రంగా ఆలోచిస్తూ.

"ఓస్— ఓస్— తమరుకూడా అడుగుతున్నారన్నమాట. అయితే ఇంకేం, రేపటినుంచి నువ్వూమీటింగు కెళ్ళొచ్చు" — నవ్వుతూ అన్నారు పరంధామయ్యగారు.

"ఛీ...పోండి... మీకెప్పుడూ, నేనేంచెప్పినా వేళాకోళమే. కోడళ్ళూ, అల్లుళ్ళూ వచ్చినాకూడా మీచిలిపి చేష్టలు తగ్గలేదు."

అప్పుడే ఏదోవనిమీద హాల్లోకొచ్చిన వాసంతి, అత్తమామల పరస్పర పరిహాసంచూసి ముసి ముసి నవ్వులతో లోపలి కెళ్ళిపోయింది, ముసలి దంపతుల అన్యోన్య దాంపత్యాన్ని తలుచుకుంటూ!

"ఊ... అసలు సంగతిచెప్పు" అన్నారు పరంధామయ్యగారు, మీనాక్షమ్మ కేసి చూస్తూ.

"మన ఎదురింటి కమలమ్మగారి కూతురు గిరిజలేదూ. దాని మొగుడు దాన్ని పనిమనిషిని చూసినట్టు చూస్తాడు. ప్రతిరోజూ తాగేసి చావబాదుతాడు. రోజుకో దెబ్బ, మందులూ, కట్లూ, దానికి సాయంగా ఏడాదికోపిల్ల. అప్పుడే ముగ్గురు పిల్లలు దానికి. చక్కగా చదువుతుంది. బుద్ధిమంతురాలు. కానీ ఈ రాతఏమిటో? దాని బతుకు దినదినగండంలా అనిపిస్తుంది"

విచారంతో చెబుతోంది మీనాక్షమ్మ.

"మీనాక్షీ, ఈ విషయాలే మహిళాసంస్థ చర్చిస్తోంది. భర్త ఆవిధంగా భార్యని హింసపెడుతూ వుంటే, ఆ ఇల్లాలు, 'నారాత' అనుకొని జీవితంతో రాజీపడి, జీవచ్ఛవంలా బతకనవసరంలేదు. అతనినుండి విముక్తి పొంది, తన స్వశక్తితో తనపిల్లల్ని పోషించుకుంటూ, తనకిష్టమైతే, ఎవరైనా చేసుకుంటానని ముందుకొస్తే, వివాహంకూడా చేసుకుని, తిరిగి కొత్త జీవితం ప్రారంభించే హక్కు ఆమెకుంది "ఇన్‌హ్యూమన్ క్రూయల్టీ" కింద ఆమెభర్తనుండి విడాకులు పొందవచ్చు"—

పరంధామయ్యగారు చెబుతున్న ఒక్కొక్కమాటా జాగ్రత్తగా వింటోంది మీనాక్షమ్మ. రేపే వెళ్ళి ఈ విషయం గిరిజతో చెప్పి ఆమెని ఈబాధల్లోంచి విముక్తురాల్ని చెయ్యాలనుకుంది. మనస్సులోనే మహిళా అభ్యుదయ సంస్థలన్నిటికీ నమస్కరించింది. వెంటనే గాయత్రి జ్ఞాపకానికొచ్చింది. "ఛీ ..ఛీ— ఎంత మూర్ఖురాలు? హక్కులంటే ఇవా? మొగుడిమీద కక్ష తీర్చుకోవడమా? ఆడా, మగా, సమభావంగా మెదిలితేతప్ప లేకపోతే ఈ అస్తవ్యస్తాలూ, హెచ్చుతగ్గులూ ఎప్పటికీ మారవు, ఎన్ని సంస్థలు వెలిసినాసరే" ఆలోచిస్తూ మెల్లగా నిద్రలోకి జారుకుంది మీనాక్షమ్మ, గాయత్రి మొగుణ్ణి తలుచుకుని బాధపడుతూ.